సాక్షి సంగారెడ్డి

బుధవారం। 3। సెప్టెంబర్। 2025

సకల హంగులతో సిద్ధం
సంగారెడ్డి మెడికల్ కళాశాల భవనాలు పూర్తయ్యాయి. వీటిని మంత్రి దామోదర రేపు ప్రారంభించనున్నారు. వివరాలు 8లో ▸

అభివృద్ధిపై అధ్యయనం
అభివృద్ధి పనులను అధ్యయనం చేసేందుకు యూపీలోని సర్పంచ్‌ల బృందం మనోహరాబాద్‌లో పర్యటించింది. వివరాలు 8లో ▸

యూరియా కోసం ఇక్కట్లు
హత్నూర(సంగారెడ్డి): యూరియా కోసం రైతులు యుద్ధం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

సింగూరుకు 62,336 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టు నుంచి మంగళవారం వరద జలాలను విడుదల చేశారు. ఎగువ భాగం నుంచి 62,336 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. ఆరు గేట్లు ఎత్తి 63,906 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

అర్హులందరికి రేషన్ కార్డులు
ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి


మాట్లాడుతున్న సంజీవరెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికి కొత్తగా రేషన్ కార్డులు మంజూరు చేస్తుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి తెలిపారు. మంగళవారం కల్హేర్‌లో లబ్ధిదారులకు కొత్తగా రేషన్‌కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు దశలవారీగా నెరవేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివ శ్రీనివాస్, మాజీ సీడీసీ చైర్మన్ నర్సింహారెడ్డి, మాజీ ఆత్మకమిటీ చైర్మన్ భాస్కర్‌సేట్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు పోచయ్య, నాయకులు తుకరాం, దేవదాస్, వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం: సౌజన్య


మాట్లాడుతున్న సౌజన్య

పటాన్‌చెరు టౌన్: చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి సౌజన్య అన్నారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం బీరంగూడ లోని శక్తి సదన్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. విద్య, వృత్తి నైపుణ్యాలు, అభివృద్ధి ద్వారా సమాజంలో తమ స్థానాన్ని సంపాదించుకోవాలని సూచించారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సలహాలు, రక్షణ పథకాలు సమాచారం అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి, శక్తి సదన్ హోమ్స్ ఇన్‌చార్జి సుజాత తదితరులు పాల్గొన్నారు.

కార్మికశాఖ సహాయ అధికారి సస్పెన్షన్

నారాయణఖేడ్: అవినీతి, ఆరోపణలపై నారాయణఖేడ్ సహాయ కార్మికశాఖ అధికారి గిరిరాజ్, ఆయనకు సహకరించిన జూనియర్ అసిస్టెంట్ సాయిలు, అటెండర్ నర్సింహులును సస్పెండ్ చేశారు. పలువురు కార్మికుల ఫిర్యాదులపై ఉమ్మడి జిల్లా కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రావు జూలై నెలలో విచారణ జరిపారు. నివేదిక ఆధారంగా సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ అయ్యాయని జిల్లా కార్మికశాఖ అధికారి రవీందర్‌రెడ్డి తెలిపారు. కార్మికులకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు వికారాబాద్ జిల్లా నుంచి యాదయ్యను ఇన్‌చార్జి సహాయ కార్మిక శాఖ అధికారిగా నియమించారని తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం
పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మాణయ్య


క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న నాయకులు

జోగిపేట(అందోల్): క్రీడలతో క్రమశిక్షణ, మానసికోల్లాసానికి దోహదపడతాయని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎ.మాణయ్య, మండల విద్యాధికారి బి.కృష్ణ అన్నారు. మంగళవారం జోగిపేటలోని ఎన్‌టీఆర్ మైదానంలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడోత్సవాలు ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిలుగా విచ్చేసి క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తిని పెంచేందుకు క్రీడా పోటీలు అవసరమన్నారు. భవిష్యత్‌లు ఎస్‌జీఎఫ్ సర్టిఫికేట్లు ఉపయోగపడతాయని చెప్పారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితోనే క్రీడలు ఆడాలని, గెలుపోటములు సహజమేనని వివరించారు. పీఆర్టీయూ మండలశాఖ అధ్యక్షుడు నరోత్తంకుమార్, అసోసియేట్ అధ్యక్షుడు మంజ్యానాయక్, జి.అనిల్‌కుమార్, జిల్లా పీఈటీ అసోసియేషన్ అధ్యక్షుడు సుభాష్, రాష్ట్ర అసోసియేట్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సంగారెడ్డిలో రోడ్డుపై బైఠాయించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, కార్యకర్తలు


జహీరాబాద్‌లో ఆందోళనలో పాల్గొన్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, పార్టీ కార్యకర్తలు

కాళేశ్వరంపై కాంగ్రెస్ కుట్ర

బీఆర్‌ఎస్‌ను బద్నామ్ చేసేందుకు యత్నం
- తప్పుడు నివేదికలతో ప్రజలను మభ్యపెడుతున్న ప్రభుత్వం
- ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు ధ్వజం
- సంగారెడ్డి, జహీరాబాద్‌లో నిరసనలు

సంగారెడ్డి /జహీరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, కె.మాణిక్‌రావు విమర్శించారు. మంగళవారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు సంగారెడ్డి, జహీరాబాద్ పట్టణాల్లో ఆందోళన చేశారు. రోడ్డుపై బైఠాయించి, రాస్తారోకో చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు వేర్వేరుగా మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌ను బద్నామ్ చేసేందుకు తప్పుడు నివేదికలతో ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందని మండిపడ్డారు. ఇది కేసీఆర్‌పై చేస్తున్న కుట్ర మాత్రమే కాదని, తెలంగాణ నదీ జలాలను పక్క రాష్ట్రాలకు తరలించి కాళేశ్వరాన్ని ఎండబెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. గురుదక్షిణ చెల్లించుకోవడానికి కాళేశ్వరం ప్రాజెక్టును మూత పడాలని, గోదావరి జలాలు బనకచర్లకు వెళ్లేందుకు రేవంత్‌రెడ్డి కుట్ర చేస్తున్నాడని విమర్శించారు. సీబీఐకి కాళేశ్వరం కేసు అప్పజెప్పడం అంటే పూర్తిగా ప్రాజెక్టును మూసివేయడమేనని చెప్పారు. నిన్నటి దాక సీబీఐపై వ్యతిరేకంగా మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక్క రోజులోనే ఎందుకు మాట మార్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజలు, రైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, వారి దృష్టి మరల్చేందుకు కాళేశ్వరం నాటకం ఆడుతున్నారని చెప్పారు. కాళేశ్వరం కేసును వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేకుంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. .సంగారెడ్డిలో జరిగిన కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు జైపాల్ రెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్‌లు విజేందర్ రెడ్డి, బుచ్చిరెడ్డి ,నాయకులు వెంకటేశ్వర్లు ,నర్సింలు, అలాగే.. జహీరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు తట్టు నారాయణ, నర్సింహులు, సంజీవరెడ్డి, వెంకటేశం, రవీందర్, నాయకులు బండి మోహన్, మొహియొద్దీన్, బొగ్గుల సంగమేశ్వర్, నర్సింహాగౌడ్ పాల్గొన్నారు.

కవిత సస్పెన్షన్ సబబే..
- కేసీఆర్ నిర్ణయానికి కట్టుబడి ఉంటాం
- ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి/జహీరాబాద్: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను సస్పెండ్ చేస్తూ పార్టీ అధినేత కేసీఆర్ తీసుకున్న నిర్ణయం సబబేనని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు పేర్కొన్నారు. మంగళవారం వారు వేర్వేరుగా ప్రకటలు విడుదల చేశారు. కేసీఆర్ ఏ నిర్ణయం తీసుకున్నా అది బీఆర్‌ఎస్ పార్టీకి, తెలంగాణ ప్రజల మేలు చేకూరే విధంగా ఉంటుందని చెప్పారు. కవితను బీఆర్‌ఎస్ నుంచి సస్పెండ్ చేస్తూ అధినేత కేసీఆర్ తీసుకున్న నిర్ణయంపై వారు స్పందించారు. ఎంత మంది పార్టీకి ద్రోహం చేసినా బీఆర్‌ఎస్ పార్టీ తెలంగాణ ప్రజల గుండెల్లో ఉంటుందని పేర్కొన్నారు. పార్టీని ఇబ్బందులు పెట్టాలని చూస్తే తన, పర భేదాలు లేకుండా క్రమశిక్షణ చర్యలు ఉంటాయని కేసీఆర్ మరోసారి స్పష్టం చేశారని అన్నారు. కేసీఆర్ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని ఎమ్మెల్యేలు చింతా, మాణిక్‌రావు అన్నారు.

జిల్లాలో సెమీకండక్టర్ల పార్కు..!

- ఆరూరులో 193 ఎకరాలు సేకరిస్తున్న టీజీఐఐసీ
- భూములను ఈ పరిశ్రమలకు కేటాయించే యోచన

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: జిల్లాలో సెమీ కండక్టర్ల తయారీ పార్కు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. సదాశివపేట మండలం ఆరూరు గ్రామ శివారులో టీజీఐఐసీ (తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్) సేకరిస్తున్న భూములను ఈ పార్కుకు కేటాయించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. సెల్‌ఫోన్లు వంటి ఆధునిక ఎలక్ట్రానిక్స్ పరికరాల్లో వినియోగించే మైక్రో చిప్స్‌లు ఈ సెమీ కండక్టర్ల పరిశ్రమల్లో తయారవుతుంటాయి. ఈ రంగం అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటీవల కాలంలో ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాయి. ఈ క్రమంలో ఈ పార్కును ఇక్కడ ఏర్పాటు చేసే అంశాన్ని ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు ఆ సంస్థ వర్గాలు పేర్కొంటున్నాయి.

193 ఎకరాలను సేకరిస్తున్న రెవెన్యూశాఖ

ఆరూరు గ్రామ శివారులో ఇండస్ట్రియల్ పార్కు కోసం భూములు సేకరిస్తున్న విషయం విదితమే. 193 ఎకరాల భూసేకరణ కోసం రెవెన్యూ శాఖ ఈ ఏడాది జూన్‌లో నోటిఫికేషన్ జారీ చేసింది. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఈ భూములు సేకరిస్తున్నట్లు రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు. సంగారెడ్డి నియోజకవర్గం పరిధిలో.. ముంబై హైవేకు సమీపంలో ఉన్న ఈ భూములను సేకరించేందుకు రెవెన్యూ అధికారులు ఇప్పటికే నిర్వాసిత రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఈ భూముల్లో నిరుపేదలకు చెందిన అసైన్డ్ భూములే అధికంగా ఉన్నాయి. భూమి లేని నిరుపేదలకు గతంలో ప్రభుత్వం పంపిణీ చేసిన భూములను ఇప్పుడు పరిశ్రమల కోసం సేకరిస్తోంది. సేకరించిన ఈ భూమిని టీజీఐఐసీకి అప్పగిస్తుంది. టీజీఐఐసీ ఈ భూముల్లో పరిశ్రమలు ఏర్పాటుకు అనువుగా రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ, నీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాలు కల్పించి పరిశ్రమలకు కేటాయిస్తుంది. ఇలా ఆరూరులో సేకరిస్తున్న భూముల్లో సెమీ కండక్టర్ల పార్కును ఏర్పాటు చేసే యోచనలో ఉంది. ఇక్కడ ఫార్మా, బల్క్‌డ్రగ్, కెమికల్ వంటి కాలుష్య కారక పరిశ్రమలను ఏర్పాటు చేస్తే స్థానికుల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పెద్దగా కాలుష్యం లేని సెమీ కండక్టర్ల పరిశ్రమలను ఏర్పాటుకు అనుమతిస్తే స్థానికుల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయని ప్రభుత్వం భావిస్తోంది.

రూ.500 కోట్లతో మహబూబ్‌సాగర్ సుందరీకరణ

- టూరిజం, రిక్రియేషన్ స్పాట్‌గా అభివృద్ధి
- త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన
- పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి


మ్యాప్‌ను పరిశీలిస్తున్న హెచ్‌ఎండీఏ అధికారులు, చిత్రంలో కలెక్టర్ ప్రావీణ్య, జగ్గారెడ్డి

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) ద్వారా రూ.500 కోట్ల అంచనా వ్యయంతో మహబూబ్‌సాగర్ సుందరీకరణ పనులు చేపడుతామని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డి ప్రజలతో పాటు, హైదరాబాద్ ఐఐటీ విద్యార్థులు, ఆర్డినెన్స్‌ఫ్యాక్టరీ ఉద్యోగులకు ఆహ్లాదాన్ని పంచేలా దీన్ని ఓ టూరిజం స్పాట్‌గా, రిక్రియేషన్ సెంటర్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారులతో కలిసి మహబూబ్‌సాగర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ సాగర్ మధ్యలో ఉన్న సోమేశ్వరాలయం అభివృద్ధితోపాటు, మహాత్మ వుడి విగ్రహం ఏర్పాటు చేసి కేబుల్ బ్రిడ్జితో అనుసంధానించేలా డిజైన్‌లు రూపొందించారని చెప్పారు. ఐఐటీహెచ్‌ను అనుసంధానించేలా మహబూబ్‌సాగర్ నుంచి వంద ఫీట్ల వెడల్పుతో రహదారిని నిర్మిస్తామన్నారు. పట్టణంలోని మురుగునీరు మహబూబ్‌సాగర్‌లోకి చేరకుండా 23.5 కే.ఎల్. సామర్థ్యంతో సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, సైకిల్ ట్రాక్, వాచ్‌టవర్, బతుకమ్మ ఘాట్, చిల్డ్రన్స్ ప్లే ఏరియా నిర్మాణం వంటివి సుందరీకరణ పనుల్లో ఉంటాయని ఆయన వివరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎండీఏ ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు సుందరీకరణ పనుల్లోని వివిధ కాంపోనెంట్ల అభివృద్ధి పనులను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

పంచాయతీ ఓటర్లు 7,44,157

- తుది ఓటరు జాబితా విడుదల
- తగ్గిన పంచాయతీలు, వార్డులు, ఓటర్లు
- పంచాయతీ కార్యాలయాల్లో జాబితా ప్రదర్శన


కల్హేర్ మండల పరిషత్‌లో ఓటరు, పోలింగ్ స్టేషన్ల జాబితా ప్రదర్శిస్తున్న అధికారులు

సంగారెడ్డి జోన్: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారులు కొత్త ఓటరు జాబితాతో పాటు పోలింగ్ స్టేషన్ల జాబితా సిద్ధం చేసి విడుదల చేశారు. ఈ మేరకు జిల్లాలో 7,44,157 మంది ఓటర్లు ఉండగా 5370 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. అత్యధికంగా మహిళలు ఉన్నారు. గత నెల 26న పంచాయతీలలో వార్డుల వారీగా కొత్త ఓటరు జాబితాతో పాటు పోలింగ్ స్టేషన్లను గుర్తించి జాబితా తయారు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు అధికారులు జాబితాలను సిద్ధం చేసి, ప్రచురించింది.

2010 అభ్యంతరాలు స్వీకరణ, పరిష్కారం

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గత నెల 28న ముసాయిదా ఓటరు జాబితాతో పాటు పోలింగ్ స్టేషన్ల వివరాలు పంచాయతీల వారీగా ప్రకటించారు. 29, 30 తేదీలలో జిల్లా స్థాయితోపాటు మండల స్థాయిలో రాజకీయ పార్టీల నేతలతో ముసాయిదా జాబితాలపై సమీక్ష నిర్వహించారు. అదేవిధంగా 28 నుంచి 30 వరకు ముసాయిదా జాబితాలపై అభ్యంతరాలు స్వీకరించారు. ఈ మేరకు జిల్లాలో 2010 అభ్యంతరాలను స్వీకరించి, వాటిని పరిష్కరించి తుది ఓటరు జాబితాతో పాటు పోలింగ్ స్టేషన్ల జాబితాలను సిద్ధం చేశారు. మంగళవారం కలెక్టర్ ప్రావీణ్య ఆమోదంతో తుది జాబితాలను విడుదల చేశారు. గ్రామ పంచాయతీలలో పూర్తి వివరాలను ప్రచురించారు.

మున్సిపాలిటీలలో విలీనంతో తగ్గింపు

జిల్లాలో పలు గ్రామ పంచాయతీలను సమీప మున్సిపాలిటీలలో విలీనం చేయటంతో పాటు కొత్తగా మున్సిపాలిటీలు ఏర్పడ్డాయి. గత ఏడాది సెప్టెంబరులో విడుదల చేసిన జాబితా కంటే ప్రస్తుతం విడుదల చేసిన జాబితా ప్రకారం 40 వేల వరకు ఓటర్లు తగ్గారు. గ్రామ పంచాయతీలు 20, వార్డులు 188 తగ్గాయి.

జిల్లాలోని ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	మహిళలు	పురుషులు	ఇతరులు	పోలింగ్ స్టేషన్‌లు
అందోల్	84548	81382	3	1252
నారాయణఖేడ్	94347	95108	7	1628
నర్సాపూర్	22051	20841	2	334
పటాన్‌చెరు	11227	10805	2	102
సంగారెడ్డి	68346	65367	28	810
జహీరాబాద్	95324	94767	2	1244

తక్షణమే బకాయిల విడుదల


కలెక్టరేట్ ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ధర్నా

- ఎస్‌ఎఫ్‌ఐ నేతల డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట ధర్నా

సంగారెడ్డి ఎడ్యుకేషన్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహేష్, రాజేష్ డిమాండ్ చేశారు. మంగళవారం సంగారెడ్డిలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు కలెక్టరేట్ వరకు ర్యాలీ, అనంతరం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న రూ.8,158 కోట్ల స్కాలర్‌షిప్‌తో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు.. అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఫీజుల బకాయిలు చెల్లించలేదని మండిపడ్డారు. దీంతో ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థుల దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఒరిజినల్ సర్టిఫికెట్స్ ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ హాస్టళ్లు కూడా మూత పడ్డాయన్నారు. తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ పాటు స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు పావని, శ్రావణి, శంకర్, అభి, చిన్న, సందీప్, రజనీకాంత్, రిషి, మార్క్స్, సిద్దు, రాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గతుకుల రోడ్లు.. అగచాట్లు

కోహీర్–తాండూరు ప్రధాన రహదారి అధ్వానం

- దెబ్బతిన్న రోడ్డుపై ఏర్పడిన పెద్ద గోతులు
- వాహనాదారులకు తప్పని పాట్లు


కోహీర్-తాండూర్ ఆర్‌అండ్‌బీ రహదారిపై కోహీర్ అంబేద్కర్‌చౌక్ వద్ద ఏర్పడిన పెద్ద గోతి

జహీరాబాద్: మండల కేంద్రమైన కోహీర్ పట్టణం మీదుగా 65వ జాతీయ రహదారి నుంచి తాండూరు వెళ్లే రహదారిపై పెద్ద గోతులు ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారి నుంచి బిలాల్‌పూర్ గ్రామమైన రాష్ట్ర సరిహద్దు వరకు సుమారు 20 కిలోమీటర్ల మేర ఆర్‌అండ్‌బీ రహదారిపై గోతులు ఏర్పడ్డాయి. రాత్రి పూట అయితే ద్విచక్ర వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయని పలువురు ఆవేదన చెందుతున్నారు.

కోహీర్ పట్టణంలో అంబేద్కర్ చౌక్ వద్ద ఏర్పడిన పెద్ద గోతిని పూడ్చే విషయంలో అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర సరిహద్దు నుంచి మనియార్‌పల్లి, బిలాల్ పూర్, కోహీర్ గ్రామాల మీదుగా 65వ జాతీయ రహదారి వరకు ఆర్‌అండ్‌బీ రహదారిపై గోతులు ఏర్పడినా వాటిని తాత్కాలిక మరమ్మతులు చేయడం లేదు. వికారాబాద్ జిల్లా తాండూరు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి కావడంతో ట్రాఫిక్ అధికంగా ఉంటోంది. ఈ రహదారి మీదుగా భారీ వాహనాలు రాక పోకలు సాగిస్తుంటాయి. పెద్ద గోతులు ఏర్పడటంతో అధిక లోడ్‌తో వెళ్లే వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దశాబ్ద కాలం క్రితం రహదారికి ప్యాచ్ వర్క్ పనులు చేసి సరిపెట్టారు. క్రమంగా రహదారి దెబ్బతినడంతో ప్రజల పాలిట శాపంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.


రహదారిపై ఏర్పడిన గోతులు

తాత్కాలిక మరమ్మతులకు ప్రతిపాదించాం

రహదారి దెబ్బతిన్నందున తాత్కాలిక మరమ్మతుల కోసం ప్రతిపాదించాం. రూ.15 లక్షలతో వరద నష్టం కింద నిధుల మంజూరీ కోసం ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే తాత్కాలికంగా అభివృద్ధి పనులను చేపడుతాం. పెద్ద గోతులు ఏర్పడిన ప్రాంతంలో కంకరను పోయించి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపడతాం.
– శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ డీఈఈ

క్లుప్తంగా

లోకకల్యాణం కోసం సైకిల్ యాత్ర


సైకిల్‌యాత్రను ప్రారంభిస్తున్న గ్రామస్తులు

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రానికి చెందిన రాంచందర్ లోక కల్యాణం కోసం కశ్మీర్ వరకు సైకిల్ యాత్రను ప్రారంభించాడు. మండల కేంద్రం నుండి ఆయన పలు రాష్ట్రాల మీదుగా వెండి త్రిశూలం సైకిల్‌పై ఏర్పాటు చేసుకొని కశ్మీర్ వరకు సైకిల్‌యాత్ర చేపట్టనున్నాడు. మంగళవారం స్థానిక రామాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి సైకిల్‌యాత్రను ప్రారంభించాడు. ఈ సందర్భంగా ఆయనను స్థానికులు సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గంగారెడ్డి, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ సత్యం, శిశుమందిర్ హెచ్ఎం వీరప్ప, రమేశ్, సీతారం, మల్లేశం తదితరులున్నారు.

విధులకు ఆటంకం

కేసు నమోదు


కమిషనర్‌తో వాగ్వాదం చేస్తున్న రత్నాకర్

దుబ్బాకటౌన్: ఇంటి కొలతలు తీసుకునేందుకు వెళ్లిన మున్సిపల్ కమిషనర్, సిబ్బందిపై అనుచితంగా ప్రవర్తించి, విధులకు ఆటంకం కల్గించిన ఆర్ఎంపీపై కేసు నమోదైంది. ఈ ఘటన దుబ్బాక పట్టణంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. కమిషనర్ రమేశ్ కుమార్ వివరాల మేరకు... పట్టణంలోని 14వ వార్డులో ఆర్ఎంపీ మర్గల రత్నాకర్‌కు చెందిన ఇంటికి కొలతలు తీసుకునేందుకు గతంలో మున్సిపల్ సిబ్బంది రెండు సార్లు వెళ్లారు. రత్నాకర్ వారిని దూషిస్తూ, ఇంటి కొలతలు తీసుకోకుండా అడ్డుపడ్డాడు. దీంతో మూడు రోజుల క్రితం మున్సిపల్ కమిషనర్, సిబ్బందితో కలిసి కొలతలు తీసుకునేందుకు వెళ్లగా, మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, దురుసుగా ప్రవర్తించాడు. దీంతో కమిషనర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా రత్నాకర్‌పై కేసు నమోదు చేశారు.

గంజాయి మొక్కలు స్వాధీనం


గంజాయి మొక్కలను పరిశీలిస్తున్న పోలీసులు

వట్‌పల్లి(అందోల్): గంజాయి మొక్కలను మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జోగిపేట సీఐ అనిల్‌కుమార్, ఎస్ఐ లవకుమార్ వివరాల ప్రకారం... మండంలోని బిజిలీపూర్ గ్రామానికి చెందిన గడ్డమీది రాములు తన భూమిలో పత్తిలో అంతర పంటగా గంజాయిని సాగు చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ఆరు గంజాయి మొక్కలను గుర్తించి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. నిందితుడు పరారీలో ఉన్నాడని త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. గంజాయి సాగుచేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సంగారెడ్డి క్లూస్‌టీం ఇన్‌చార్జి చిట్టిబాబు, తహసీల్దార్ చంద్రశేఖర్, వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

రెగ్యులర్ డాక్టర్‌ను నియమించాలి: సీఐటీయూ

పటాన్‌చెరు: ఇస్నాపూర్ ఈఎస్ఐ డిస్పెన్సరీలో రెగ్యులర్ డాక్టర్ లేకపోవడం వల్ల కార్మికులకు వైద్యం అందడం లేదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో డిస్పెన్సరీ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాగేశ్వరావు మాట్లాడుతూ.. రెగ్యులర్ డాక్టర్‌ను నియమించడంతోపాటు, మందుల కొరతను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ డిస్పెన్సరీకి పాశమైలారం ఇండస్ట్రియల్ ఏరియా నుంచి చాలామంది కార్మికులు వస్తారన్నారు. అయితే, రెండు నెలల క్రితం ఇక్కడ ఉన్న రెగ్యులర్ డాక్టర్ లాంగ్ లీవ్‌లో ఉన్నాడని, ప్రస్తుతం పటాన్ చెరు నుంచి డిప్యుటేషన్‌పై వస్తున్న వైద్యుడు అందుబాటులో ఉండటం లేదని ఆరోపించారు. నిరసనలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు మానిక్, పాండు రంగారెడ్డి పాల్గొన్నారు.

కోటగిరి గట్లు.. ప్రకృతికి మెట్లు


గుట్టల మధ్య నిండుకుండలా ఉన్న జలాశయం

ఉమ్మాపూర్ అటవీ ప్రాంతంలోని కోటగిరి గట్లు పచ్చదనంతో పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. ఎత్తయిన గుట్టల మధ్య జలాశయం, పరిసరాల్లో పచ్చటి పంటలు చూపరులకు కనువిందు చేస్తున్నాయి. ఆదివారం సెలవు దొరికితే చాలు పర్యాటకులు ప్రకృతి అందాలు చూడటానికి కుటుంబ సమేతంగా వస్తున్నారు. – హుస్నాబాద్‌రూరల్:


పచ్చదనంతో కనువిందు చేస్తున్న గుట్టల పరిసరాలు

సకల హంగులతో సిద్ధం


మెడికల్ కాలేజీ, హాస్టల్ సముదాయాలు

జిల్లాలో పూర్తయిన వైద్య కళాశాల భవనాలు

- అందుబాటులోకి ఖరీదైన వైద్య సేవలు
- రేపు ప్రారంభించనున్న మంత్రి దామోదర
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

సంగారెడ్డి: పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి. జిల్లా మెడికల్ కళాశాల భవనాలు పూర్తయ్యాయి. ఈ భవన సముదాయాలను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గురువారం ప్రారంభించనున్నారు. గతంలో సరైన భవనాలు లేకపోవడంతో ఇబ్బందుల మధ్యే బోధన, వైద్య సదుపాయాలు కొనసాగాయి. 500 పడకల జిల్లా ఆస్పత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన, క్రిటికల్ కేర్ యూనిట్, కేన్సర్ రోగుల ప్రత్యేక వార్డును ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

జిల్లా ఆస్పత్రికి శంకుస్థాపన

సంగారెడ్డి జిల్లా ఆస్పత్రి భవనాలు ఏళ్ల క్రితం నిర్మించినవి కావడంతో శిథిలమయ్యాయి. వాటి స్థానంలో కొత్తవి నిర్మించాలని సర్కారు నిర్ణయించింది. ఇక్కడ 300 పడకలతో జిల్లా జనరల్ ఆస్పత్రి, 150 పడకలతో మాతా శిశు ఆరోగ్య కేంద్రాలున్నాయి. వాటి స్థానంలో 500 పడకలతో భవనాలు నిర్మించనున్నారు. వైద్య కళాశాలకు మంజూరైన నిధుల నుంచి రూ. 273.40 కోట్లను ఆస్పత్రి నిర్మాణానికి వెచ్చించనున్నారు. రేపు ఆస్పత్రి నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేయనున్నారు.

భవనాల వివరాలు

ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణంలో భాగంగా రెండో విడతలో ఆర్అండ్‌బీ శాఖ రూ.156 కోట్ల నిధులతో మెయిన్ బ్లాక్(జీ+2), బాలుర హాస్టల్ (జీ+7), బాలికల హాస్టల్(జీ+8), బాలుర రెసిడెంట్ హాస్టల్(జీ+2), ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ క్వార్టర్స్ జీ+3, నూతన మార్చురీ భవనాలు నిర్మించారు. వీటన్నింటిని గురువారం మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభిస్తారు.

50 పడకలతో క్రిటికల్ కేర్

50 పడకల క్రిటికల్ కేర్ భవనాన్ని రూ.23.70 కోట్లతో నిర్మించారు. అందులో ఖరీదైన వైద్య పరికరాలను సిద్ధం చేశారు. ఇక నుంచి కార్పొరేట్‌కు దీటుగా వైద్యం అందిస్తామని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ మురళీకృష్ణ పేర్కొన్నారు.

కళాశాలకు రూ.510 కోట్లు..

జిల్లా ఆస్పత్రి ఆవరణలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు 2022లో రూ.510 కోట్లు మంజూరయ్యాయి. ఇటీవలే రెండంతస్తుల భవనం పనులు పూర్తయ్యాయి. కాలేజీలో ప్రస్తుతం మూడో బ్యాచ్ కొనసాగుతోంది. విద్యార్థులు, వైద్యులు, సిబ్బంది కోసం వేర్వేరుగా వసతి గృహ భవనాలు కూడా నిర్మించారు. ఇక విద్యార్థుల కష్టాలు తీరనున్నాయి.

కేన్సర్ రోగుల కోసం

కేన్సర్ రోగులకు ఇకనుంచి మెరుగైన సేవలు అందనున్నాయి. ఇప్పటి వరకు జిల్లాలో 13 చోట్ల ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళా పేరిట వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. కేన్సర్ అనుమానితులను హైదరాబాద్‌లోని ఎంఎన్ ఆస్పత్రికి పంపిస్తున్నారు. ఇక నుంచి ఇక్కడే వైద్యం అందించేలా 20 పడకలతో వార్డును ఏర్పాటు చేశారు.

మంత్రి కృషితో అందుబాటులోకి

“వైద్యశాఖ మంత్రి దామోదర కృషితోనే మెడికల్ కాలేజీ భవనాలు పూర్తయ్యాయి. ఇక నుంచి రోగులకు మెరుగైన సేవలు, విద్యార్థులకు నాణ్యమైన బోధన వసతి అందనుంది. ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది సమష్టి కృషితో మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేస్తాం.”

– జయప్రకాశ్ రావు, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్

నేరాల నియంత్రణలో ‘సీసీ’లు


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీపీ అనురాధ

సిద్దిపేట సీపీ అనురాధ

దౌల్తాబాద్(దుబ్బాక): నేరాలను నియంత్రించడంలో, నిందితులను గుర్తించడంలో సీసీ కెమెరాలు ఎంతో కీలక పాత్ర పోషిస్తాయని సిద్దిపేట సీపీ అనురాధ అన్నారు. మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన 16 సీసీ కెమెరాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల జియోట్యాగింగ్ ద్వారా సిద్దిపేట కమాండ్ కంట్రోల్ కేంద్రానికి అనుసంధానం చేయబడతాయని తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం, వివేకానంద యూత్ ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని సందర్శించారు. కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ నర్సింహులు, తొగుట సీఐ లతీఫ్, దౌల్తాబాద్, తొగుట ఎస్ఐలు అరుణ్‌కుమార్, రవికాంత్‌రావు, మాజీ జెడ్పీటీసీ భూపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, నాయకులు భద్రయ్య, రాములు, అశోక్, లాల్ రమేశ్, నర్సింహారెడ్డి, ఎల్లయ్య పాల్గొన్నారు.

వేధింపులతో నవవధువు ఆత్మహత్య

ఉమ్మడి మెదక్ జిల్లాలో వేర్వేరు చోట్ల ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు.


రాధిక

చిన్నశంకరంపేట(మెదక్): కాళ్ల పారాణి ఆరకముందే నవ వధువు అత్తింటి వేధింపులతో ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ నారాయణగౌడ్ కథనం మేరకు... బుడగ జంగాల కాలనీకి చెందిన తల్లితండ్రులు లేని ఊబిది అలియాస్ రాధిక(19)ని నెల రోజుల క్రితం ఇదే కాలనీకి చెందిన వానరాసి కుమార్ పెళ్లి చేసుకున్నాడు. పెళ్లి జరిగిన వారం రోజుల నుంచే భర్త మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. దీంతో కుల పెద్దలను ఆశ్రయించడంతో భార్యాభర్తలకు నచ్చజెప్పారు. అయినా భర్త తీరు మార్చుకోకపోవడంతో పాటు భౌతికదాడికి దిగడంతో రెండు రోజుల క్రితం అత్తింటి నుంచి తల్లిగారి ఇంటికి వచ్చింది. రెండు రోజులుగా మానసిక ఆందోళనకు గురైన యువతి జీవితంపై విరక్తి చెంది మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరివేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

అదే ఇంట్లో.. నలుగురు..

కాగా.. క్షణికావేశం, జీవితంపై అవగాహన లేకపోవడంతో ఐదేళ్లలో బుడగజంగాల కాలనీలోని ఆ ఇంట్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. ఊబిది యాదగిరి, యాదమ్మ దంపతులకు నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇందులో ఇద్దరు అమ్మాయిల పెళ్లిళ్లు అయ్యాయి. ఆరేళ్ల క్రితం తండ్రి యాదగిరి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఇది జరిగిన ఏడాదికి మరో కూతురు పూజ(15), గత ఏడాది అక్టోబర్‌లో తల్లి యాదమ్మ(40), ఆరు నెలల క్రితం పెద్ద కుమారుడు శ్రీనివాస్, తాజాగా చిన్న కూతురు రాధిక కూడా ఇదే ఇంట్లో ఉరివేసుకున్నారు.

అప్పుల బాధతో రైతు..


నర్సింలుగౌడ్

శివ్వంపేట(నర్సాపూర్): అప్పుల బాధతో రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళవారం చోటుచేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం... మండల పరిధిలోని పోతులబోగూడ గ్రామానికి చెందిన నర్సింలు గౌడ్ (45) వ్యవసాయంతో పాటు పౌల్ట్రీ ఫామ్‌తో జీవనోపాధి పొందుతున్నాడు. సంవత్సరం క్రితం నూతనంగా ఇంటి నిర్మాణంతో పాటు కోళ్ల ఫామ్ షెడ్ వేశాడు. వీటికి రూ.20 లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పులిచ్చిన ప్రైవేటు బ్యాంకు, ఇతరుల నుంచి ఒత్తిడి పెరగడంతో తీర్చలేక మనస్తాపానికి గురై సోమవారం సాయంత్రం తన వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగి స్నేహితులకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అపస్మారక స్థితిలో ఉన్న నర్సింలుగౌడ్‌ని చికిత్స నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుండి సూరారంలోని నారాయణ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కొడుకులు ఉన్నారు.

అనారోగ్యంతో ఆటో డ్రైవర్..

జగదేవ్‌పూర్(గజ్వేల్): అనారోగ్యంతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ కృష్ణారెడ్డి కథనం ప్రకారం... గ్రామానికి చెందిన చిక్కుడు శ్రీనివాస్(36) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా కొన్ని రోజులుగా అనారోగ్యంతో పాటు ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. తీవ్ర మనస్తాపానికి గురై సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

లోయలోకి దూసుకెళ్లిన కారు

సంగారెడ్డి క్రైమ్: కారు అదుపు తప్పి లోయలోకి దూసుకెళ్లింది. ఈ ఘటన మంగళవారం పట్టణంలోని బైపాస్ రోడ్డులో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన వ్యక్తి(30), స్థానిక ఐబీ నుంచి బైపాస్ రోడ్డుకు వెళ్లే మార్గంలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండటంతో నిదానంగా వెళ్తున్నాడు. ఈ క్రమంలో బైపాస్ రోడ్డులోని గ్రామీణ వికాస్ బ్యాంక్ వద్దకు రాగానే కారు స్టీరింగ్ అదుపుతప్పి ప్రక్కనే ఉన్న లోయలోకి దూసుకెళ్లింది. కారులో ఉన్న వారు సురక్షితంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

అభివృద్ధి పనులపై అధ్యయనం


పర్యటించిన యూపీ సర్పంచ్‌ల బృందం

మొక్కలు నాటుతున్న సర్పంచ్‌లు

మనోహరాబాద్(తూప్రాన్): గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, సర్పంచ్‌ల పాలన విధానం, చేపడుతున్న పనులపై అధ్యయనానికి ఉత్తర ప్రదేశ్ నూతన సర్పంచ్‌ల బృందం మంగళవారం మండలంలో పర్యటించింది. ఈ సందర్భంగా తూప్రాన్ డీఎల్‌పీఓ యాదయ్య వారికి పలు అంశాలపై వివరించారు. ముప్పిరెడ్డిపల్లిలో రికార్డులు, ఇండ్ల అనుమతులు, పనుల తీరు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీ వద్ద మొక్కలు నాటారు. అక్కడి నుంచి దండుపల్లి గ్రామంలోని పల్లె ప్రకృతివనం, డంప్‌యార్డ్, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి, అభివృద్ధిపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవీందర్, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఓ ఆదినారాయణ, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంట్లో గొడవపడి వెళ్లిన మహిళ..


వీరమ్మ

సంగారెడ్డి క్రైమ్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైంది.ఈ ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమేశ్ వివరాల ప్రకారం... ములుగు జిల్లా మంగంపేట గ్రామానికి చెందిన నీలం వీరమ్మ (55) తన కుటుంబంతో సంగారెడ్డి పట్టణానికి వచ్చి మంజీరనగర్ కాలనీలో స్థిరపడ్డారు. వృత్తిరీత్యా పట్టణంలో పద్మశాలి పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరమ్మ గత నెల 30న మధ్యాహ్నం ఇంట్లో కోడలుతో గొడవ పడి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుప్రక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు.

పటాన్‌చెరులో వ్యక్తి..

పటాన్‌చెరు టౌన్: పనిపై బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. పోలీసుల వివరాల ప్రకారం... పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని కుమ్మరి బస్తీకి చెందిన శాబుద్దీన్ బేకరీలో వర్కర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆగస్టు 29న పని ఉందని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. స్థానికంగా వెతికినా ఆయన ఆచూకీ లభించలేదు.

పార్ట్‌టైం జాబ్ పేరుతో సైబర్ మోసం

రూ.3 లక్షల 75 వేలు పోగొట్టుకున్న ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైం జాబ్ పేరుతో వచ్చిన మెసేజ్‌కు స్పందించి ప్రైవేటు ఉద్యోగి డబ్బులు పోగొట్టుకున్నాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని ఓ ప్రైవేటు ఉద్యోగికి గత నెల 25న పార్ట్ టైం జాబ్ పేరిట మెసేజ్ వచ్చింది. అందులో తన వివరాలు నమోదు చేశాడు. అపరిచిత వ్యక్తులు నగదు ఇన్వెస్ట్ చేసి, ఇచ్చిన టాస్కులు పూర్తి చేస్తే కమిషన్ ఇస్తామని ఆశ చూపారు. దీంతో ఉద్యోగి వారు చెప్పిన విధంగా పలు దఫాలుగా రూ.3 లక్షల75 వేలు చెల్లించాడు. నగదుతో పాటు, కమిషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి.. కాపర్‌వైర్ చోరీ

మద్దూరు(హుస్నాబాద్): గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి కాపర్‌వైర్ చోరీ చేశారు. ఈ ఘటన మండలంలోని సలాఖపూర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పెడతల ఎల్లారెడ్డి వ్యవసాయ బావి వద్ద ఏర్పాటు చేసిన 25కేవీఏ డిటిఆర్ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి కాపర్ వైర్‌ను దొంగిలించారు. కాపర్‌వైర్ విలువ సుమారు రూ.20వేల వరకు ఉంటుదని గ్రామస్తులు తెలిపారు.

సెంట్రింగ్ సామగ్రి..

నర్సాపూర్ రూరల్: సెంట్రింగ్ సామగ్రిని దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మండలంలోని లింగాపూర్‌లో మంగళవారం వేకువజామున జరిగింది. ఎస్సై లింగం వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన చింతల గోపాల్ సెంట్రింగ్ మేస్త్రి. తన సెంట్రింగ్ సామగ్రిని గ్రామ హనుమాన్ ఆలయం సమీపంలోని ఖాళీ స్థలంలో ఉంచాడు. మంగళవారం ఉదయం వెళ్లి చూడగా సామగ్రి కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అంత్యక్రియలకు వెళ్లి.. కుంటలో గల్లంతై..


రాజు

జగదేవ్‌పూర్(గజ్వేల్): అంత్యక్రియలకు వెళ్లిన యువకుడు కుంటలో గల్లంతయ్యాడు. ఈ ఘటన మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన చిక్కుడు శ్రీనివాస్ మృతి చెందగా అంత్యక్రియలు నిర్వహించారు. ఇదే గ్రామానికి చెందిన చిక్కుడు రాజు(26) ఆ అంత్యక్రియలకు వెళ్లాడు. అవి పూర్తి కాగానే బస్వారెడ్డి కుంటలోకి స్నానం చేసేందుకు దిగగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగాడు. వెంటనే పక్కన ఉన్నవారు రాజు కోసం కుంటలో వెతికారు. ఆచూకీ లభించక పోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ కృష్ణారెడ్డి, పోలీస్ సిబ్బంది కుంటలో ఈత వచ్చిన వారితో గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. చీకటి పడటంతో బుధవారం గజ ఈతగాళ్ల సహాయంతో వెతకనున్నట్లు పోలీసులు తెలిపారు.

బావిలో పడి వ్యక్తి మృతి

ఆత్మహత్యా? ప్రమాదవశాత్తు పడ్డాడా?

జహీరాబాద్: అనుమానాస్పదంగా బావిలో పడి వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం ... కోహీర్ మండలంలోని సజ్జాపూర్ గ్రామానికి చెందిన ఊరడి లక్ష్మయ్య(50) గత నెల 31న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఈ క్రమంలో మంగళవారం గ్రామ సమీపంలోని ఓ బావిలో శవం ఉన్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. బయటకు తీసి చూడగా లక్ష్మయ్యగా గుర్తించారు. ప్రమాదవశాత్తు పడ్డాడా? లేక ఆత్మహత్యకు చేసుకున్నాడా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడి కుమారుడు మాణయ్య ఫిర్యాదు చేశాడు.

డెంగీ.. డేంజర్

- మరో ముగ్గురికి లక్షణాలు
- తిమ్మాపూర్, అనంతసాగర్‌లో తగ్గని జ్వరాలు
- కొనసాగుతున్న వైద్య శిబిరాలు
- పారిశుధ్య నిర్మూలన అంతంతే


గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిమ్మాపూర్, అనంతసాగర్ గ్రామాల్లో విష జ్వరాలు ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. రాష్ట్ర, జిల్లా వివిధ శాఖల అధికారులు గ్రామాల్లో పర్యటించి అవగాహన కల్పిస్తున్నప్పటికీ పారిశుద్ధ్య నిర్మూలన పూర్తిస్థాయిలో నిర్మూలించలేకపోతున్నారు. గ్రామంలో మురికి కాల్వలు శుభ్రం చేసినప్పటికి ఇళ్ల మధ్య, పక్కన ఖాళీ స్థలాల్లో ఉన్న పిచ్చి గడ్డి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. గడ్డి మందు పిచికారీ చేసినా ఫలితం లేకుండా పోతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు గ్రామాల్లో డెంగీ లక్షణాలతో ముగ్గురు మృతి చెందగా, 350 మంది వరకు జ్వరాల బారిన పడి ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారు. కాగా గత నెల 24న కలెక్టర్ హైమావతి గ్రామంలో పర్యటించి పారిశుద్ధ్యంపై పలు సూచనలు చేశారు. అలాగే అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, డీపీఓ దేవికీదేవి, జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్, రాష్ట్ర మలేరియా అదనపు డైరెక్టర్ అమర్‌సింగ్‌నాయక్ గ్రామాల్లో పర్యటించి పారిశుద్ధ్య నిర్మూలన, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కానీ పారిశుద్ధ్య నిర్మూలనకు నిధులు మాత్రం కేటాయించలేదు. దీంతో నాలుగు రోజుల క్రితం తిమ్మాపూర్‌లో మాజీ సర్పంచ్ నవ్యసుమన్, అనంతసాగర్‌లో గ్రామస్తులు కలిసి బ్లీచింగ్ పౌడర్‌ను కొనుగోలు చేసి ఊరంతా పిచికారీ చేశారు. ప్రతి రోజు మండల శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తున్నారు.

మరో ముగ్గురికి డెంగీ..

తిమ్మాపూర్, అనంతసాగర్‌లో ఈ నెల 17 నుంచి వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. ప్రతి రోజు వైద్యులు జ్వర బాధితులకు రక్త నమూనాలు సేకరిస్తూ.. డెంగీ లక్షణాలు ఉన్న వారిని గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తున్నారు. మంగళవారం తిమ్మాపూర్‌లో 75 మందికి పరీక్షలు చేయగా, ముగ్గురికి డెంగీ లక్షణాలు కనిపించాయని డాక్టర్ కిరణ్ తెలిపారు. మెరుగైన వైద్యం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అనంతసాగర్‌లో 43 మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ప్రస్తుతం గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రిలో రెండు గ్రామాలకు చెందిన 20 మందికి పైగా చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందించడం లేదని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


గ్రామంలో ఇళ్ల మధ్య పెరిగిన పిచ్చిమొక్కలు